ఈనాడు ఆదిలాబాద్

మంగళవారం అక్టోబరు 8, 2024 7

అందుబాటులోకి మరో అయిదు డయాలసిస్ యంత్రాలు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: రిమ్స్‌లో మరో అయిదు డయాలసిస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఇది వరకు డయాలసిస్ కేంద్రంలో పదకొండు యంత్రాలు ఉండగా ఇటీవల ఆసుపత్రికి ప్రభుత్వం మంజూరు చేసిన అయిదు డయాలసిస్ యంత్రాలను రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్, ఆసుపత్రి పర్యవేక్షకుడు అశోక్‌తో కలిసి ప్రారంభించారు. రిమ్స్‌కు సరఫరా అయిన డయాలసిస్ యంత్రాలు నిరుపయోగంగా మారగా 'ఈనాడు'లో ఆగస్టు 13న 'నీటి పరీక్ష చేయక నిరుపయోగం' శీర్షికన ప్రచురితం అయిన కథనానికి స్పందించిన రిమ్స్ యాజమాన్యం వాటిని ఏర్పాటు చేయించి ఉపయోగంలోకి తీసుకొచ్చింది. అదనంగా ప్రారంభించిన డయాలసిస్ యంత్రాలను పురుగు మందు తాగిన, పాముకాటుకు గురైన బాధితులకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆర్ఎంఓ తొడ్సం చందు, వైద్యుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.



డయాలసిస్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్, ఆసుపత్రి పర్యవేక్షకుడు అశోక్

ఇనుప గేట్ల ఏర్పాటు

వందనం



జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో 400 మీటర్ల ట్రాక్ కేవలం క్రీడా పాఠశాల విద్యార్థుల కోసమే ఉపయోగించాలి. అయినా సాధకులు అదేమీ పట్టించుకోకుండా ట్రాక్‌పై సాధన చేస్తున్నారు. దీనిపై 'ఈనాడు'లో 'చెప్పినా.. చెవికెక్కించుకోరు..' శీర్షికన చిత్రవార్త గత నెల 2వ తేదీన ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ సిబ్బంది సాధకులు ట్రాక్ వైపు రాకుండా ఇనుప గేట్లు అమర్చారు.

- ఈనాడు, ఆదిలాబాద్, న్యూస్‌టుడే ఆదిలాబాద్ క్రీడావిభాగం

కొనేది 6 మిగతాది ఎలా సారు..?



తాంసి మండలం జామిడికి చెందిన రైతు బాబూలాల్ 5 ఎకరాల్లో సోయా పంట పండించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఎకరానికి 11 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఎకరానికి 6 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనడంతో మిగతా 25 క్వింటాళ్లు మిగిలిపోనున్నాయి. ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తే తేమశాతం, తుక్కు ఉందంటూ ధర తగ్గిస్తారు. క్వింటాకు రూ.600 నుంచి రూ.800 వరకు నష్టపోవాల్సిందే.

తాంసి, న్యూస్‌టుడే

- సోయా రైతులకు నిబంధనల మెలిక

సకాలంలో వర్షాలు.. తెగుళ్ల బెడద అంతగా లేకపోవడం ఈ ఏడాది సోయా రైతులకు కలిసొచ్చింది. అంచనాలను మించి దిగుబడి వచ్చింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 9 చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఎకరానికి 6 క్వింటాళ్ల సోయా మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధనతో కర్షకులు పూర్తి పంట కొనుగోలు కేంద్రాల్లో విక్రయించలేని పరిస్థితి ఏర్పడింది.

జిల్లావ్యాప్తంగా గతేడాది 1.20 లక్షల ఎకరాల్లో సోయా సాగైతే ఈ ఏడాది 24,301 మంది రైతులు 65 వేల ఎకరాల్లో సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవడం, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో వ్యవసాయాధికారుల అంచనాల ప్రకారం ఎకరానికి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందనుకోగా.. 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది.

ఎకరానికి 6 క్వింటాళ్లే..

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఇచ్చోడ, బోథ్, ఆదిలాబాద్ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిగతా కేంద్రాల్లో త్వరలో కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఎకరానికి 6 క్వింటాళ్ల సోయా కొనుగోలు చేయాలని అధికారులు నిబంధన విధించారు. జిల్లాలో సగటున ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. మిగిలిన పంట ఎక్కడ అమ్ముకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

- ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం, ఆదిలాబాద్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎకరానికి 6 క్వింటాళ్లు కొనుగోలు చేస్తున్నాం. సోయా అధిక మొత్తంలో కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.



దళారులను ఆశ్రయించాల్సిందేనా..

సోయా పంటను బయట ఆరబోసిన ఈ రైతు పేరు మేకల విఠల్. 4 ఎకరాల్లో పంట సాగు చేయగా ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో 24 క్వింటాళ్లు మాత్రమే తీసుకుంటారని చెబుతున్నారు. మిగిలిన 16 క్వింటాళ్లను వ్యాపారులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కలల సౌధం?? చిక్కులు అనేకం

న్యూస్‌టుడే, శ్రీరాంపూర్

ఇంటి నిర్మాణం ప్రతిఒక్కరి కల.. కొందరు యుక్త వయసులో.. మరికొందరు ఉద్యోగ విరమణ తరువాత కలల సౌధం నిర్మించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం బాగా పెరిగింది. కొత్త జిల్లా కేంద్రాలతోపాటు శివారు ప్రాంతాల్లో వీటిని నిర్మించుకుంటున్నారు. అయితే అనుభవ లేమి నిర్మాణదారులను కష్టాల పాల్జేస్తోంది. నిర్మాణదారులు కష్టాలు, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

- ఇల్లు కడితే కష్టాలు.. కట్టిస్తే నష్టాలు..
- సూచనలు పాటిస్తేనే మేలు

నస్పూర్‌లో నివసించే తిరుపతిరెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం తన కొడుకుల సలహా మేరకు పనిచేసిన ప్రాంతంలోనే ఇల్లు కట్టుకోవాలని అనుకున్నారు. భవిష్యత్తులో చిక్కులు వద్దనుకుని డీటీసీపీ లే అవుట్‌లో ఇంటి నిర్మాణానికి బిల్డర్‌ను సంప్రదించారు. నిర్మాణం సగానికిపైగా పూర్తయిన తర్వాత పనులు ముందుకు సాగడం లేదు. ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 80 శాతం డబ్బులు చెల్లించారు. చేయాల్సిన పనేమో 40 శాతం మేరకు ఉంది. ఇదేమని అడిగితే అప్పటికి, ఇప్పటికీ ధరలు పెరిగాయని, తానే అదనంగా ఖర్చు పెట్టి నష్టపోయానంటూ బిల్డర్ మాట మార్చాడు. అదనంగా మరింత సొమ్ము వెచ్చించి ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అంచనాలు బాగా పెరిగాయి.


యువ ఉద్యోగి కుమార్ ముందు చూపుతో బ్యాంకు రుణం తీసుకుని మంచిర్యాలలో ఇంటి నిర్మాణం చేపట్టారు. తానే కష్టపడి అన్నీ దగ్గరుండి చూసుకోవాలనుకుని తాపీ మేస్త్రీని మాట్లాడుకున్నారు. తెల్లకాగితంపై ఒప్పందం రాసుకున్నారు. ఎలివేషన్ పనితోపాటు, పిట్టగోడల నిర్మాణం, ఇతర పనుల వద్ద మేస్త్రీ మొరాయించడం మొదలు పెట్టాడు. ఇదేమని అడిగితే తనకు గిట్టుబాటు కాదని, అదనంగా సొమ్ము కావాలన్నాడు. మరొకరిని పెట్టుకుందామంటే తాపీ మేస్త్రీల సంఘం అంగీకరించదు. చేసేదేమీలేక అడిగినంత ఇచ్చుకుని పని పూర్తి చేయించాడు. అదనంగా రూ. 15 లక్షలు ఖర్చయింది. ఎలక్ట్రీషియన్ ఇబ్బడిముబ్బడిగా రకరకాల వైర్లు తెప్పించి, అవసరం ఉన్న దానికన్నా రెట్టింపు వినియోగించినట్లు కాకిలెక్కలు చెప్పాడు. అందరికీ సంఘాలు ఉన్నాయి. ఇల్లు కట్టుకునే వినియోగదారుడికి ఎలాంటి రక్షణ లేదని బాధితుడు వాపోయారు.



మంచిర్యాలలో నిర్మాణంలో ఉన్న భవనాలు

అనుభవలేమితో ఇబ్బందులు

కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు మిగతా వారి కన్నా కాస్త భిన్నంగా, కొత్తహంగులతో ఉండాలని అనుకోవడం సహజం. కానీ నిర్మాణ సమయంలో చిక్కులు ఎదురై అనేక మంది వివిధ విషయాల్లో ఫిర్యాదులు చేస్తుంటారు. వాటికి సరైన పరిష్కార మార్గాలు లభించడం లేదు. అధిక మొత్తం డబ్బులు వెచ్చించి అప్పులపాలు కావడం లాంటివి జరుగుతున్నాయి. జీవితంలో ఒకసారి మాత్రమే ఇల్లు కట్టుకునేవారు నూటికి 99 శాతం ఉంటారు. ఇల్లు కట్టాలని నిర్ణయించుకున్న వెంటనే దళారులో, తెలిసిన వారో రకరకాల సలహాలు ఇస్తారు. కొందరేమో ఎంతో కొంత డబ్బు ఆదా అవుతుందని సొంతంగా ఇంటిని నిర్మించుకుంటారు. ఇవన్నీ తలనొప్పి వ్యవహారాలు అనుకునే వారు గుత్తేదారు (బిల్డర్)కి అప్పగిస్తున్నారు. వారు ముందు చెప్పేది ఒకటి, తర్వాత చేసేది మరొకటి ఉండటంతో పంచాయితీలు, పోలీసులను ఆశ్రయించడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.



నిపుణులేమంటున్నారంటే..

- ఇల్లు కట్టే ముందు అనుభవజ్ఞులను సంప్రదించాలి. ఇంజినీరింగ్ నిపుణుల సలహా మేరకు ముందుగానే నిర్మాణంలో ఏమేం ఇమిడి ఉంటాయనే విషయాన్ని తెలుసుకోవాలి. వాటి ప్రకారం ఒప్పంద పత్రాన్ని నోటరీ సమక్షంలో రాసుకోవాలి.
- కొందరు ఆయా సంఘాలు నిర్ణయించిన రేట్‌ను బుక్ రేటు అంటారు. ఇంకొందరు, స్లాబ్‌రేటు (చదరపు అడుగుల లెక్కన) ప్రకారం ధరలు నిర్ణయిస్తారు. ఎలివేషన్‌తో సహా ప్రతీ అంశాన్ని ముందుగానే నిర్ణయించుకుని ఆ ప్రకారం పని చేసేలా ఒప్పందం చేసుకోవాలి.
- విద్యుత్తు, ప్లంబింగ్, ఇంటీరియర్, తలుపులు, కిటికీల విషయంలో నిపుణుల సలహా మేరకు నాణ్యమైన వస్తువులను ప్రస్తావించాలి. ఎంత పనికి ఎంత మొత్తం వస్తువులు అవసరం అవుతాయో అంచనా వేయించుకుని ఒప్పంద పత్రంలో రాయించుకోవాలి. అప్పుడే కొంత మేరకు మోసాలు జరగకుండా ఉంటాయి.
- వస్తువుల కొనుగోలు సమయంలో నాణ్యతను పాటించే డీలర్లను ఎంపిక చేసుకోవాలి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు చేస్తే, దళారుల కమీషన్ల బాధ తప్పుతుంది.

వేడుకగా బతుకమ్మ



ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో బతుకమ్మ ఆడుతున్న పాలనాధికారి రాజర్షిషా, ఎస్పీ గౌష్ ఆలం, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: స్థానిక పోలీసు హెడ్‌క్వార్టర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో జిల్లా పాలనాధికారి రాజర్షిషా, రెండో బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్, ఎస్పీ గౌష్ ఆలంలు పాల్గొని పూజలు నిర్వహించి బతుకమ్మలు ఆడి ఆకట్టుకున్నారు. వేడుకల్లో ఎస్పీ కుటుంబ సభ్యులు, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆయన కుటుంబ సభ్యులు, పోలీసుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.



క్రీడా జ్యోతి పరుగులో పాల్గొన్న పాలనాధికారి రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ గౌష్ ఆలం

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి పరుగు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సీఎం కప్-2024 క్రీడా జ్యోతి పరుగు ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాయల్ శంకర్, పాలనాధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం హాజరయ్యారు. జెండా ఊపి పరుగును ప్రారంభించి, క్రీడా జ్యోతిని పట్టుకుని పరుగులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేసి బడ్జెట్‌లో ఎక్కువగా నిధులు కేటాయించారని తెలిపారు. సీఎం కప్ పోటీలతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడంతో క్రీడారంగం దశ మారుతుందన్నారు. అనంతరం ఈ క్రీడా జ్యోతి పరుగు కుమురంభీం జిల్లా వైపు బయలుదేరి వెళ్లింది. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయం సిబ్బంది ఎం.డి.రజియోద్దీన్, క్రీడా పాఠశాల శిక్షకులు నంగనూరి రాజు, సాయికుమార్, శిక్షణ పోలీసులు ఉన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

బోథ్, న్యూస్‌టుడే: బోథ్‌లోని దుర్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భరతనాట్యం పోటీలను నిర్వహించారు. పలువురు విద్యార్థినులు భక్తిపాటలపై భరతనాట్యం చేశారు. వీరు చేసిన నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం కమిటీ సభ్యులు వీరికి బహుమతులు అందజేశారు.



బోథ్‌లో భరతనాట్యం చేస్తున్న విద్యార్థినులు

పసి ప్రాణాలకు భరోసా కరవు

- ఎస్ఎన్‌సీయూలో పనిచేయని వార్మర్లు, వెంటిలేటర్లు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే

రిమ్స్‌లో ఎన్‌హెచ్ఎం(నేషనల్ హెల్త్ మిషన్) పథకంలో నిర్వహిస్తున్న ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ నియోనిటాల్ కేర్ యూనిట్) విభాగం అస్తవ్యస్తంగా మారింది. ఆ విభాగంలోని పలు పరికరాలు, యంత్రాలు మొరాయిస్తుండటంతో శిశువుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది.

నవజాత శిశువులకు శ్వాసకోశ, ఇతర రకాల రుగ్మతలు ఉంటే వారిని ఎస్ఎన్‌సీయూ విభాగానికి తరలించి చికిత్సలు అందజేస్తుంటారు. ఇందుకు రిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎన్‌సీయూ విభాగంలో రెండు వార్డులున్నాయి. రిమ్స్‌లో జన్మించిన శిశువులకు ఒకటి, బయట ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు మరో వార్డును ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు ఆ విభాగానికి రిమ్స్, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వచ్చే నవజాత శిశువుల సంఖ్య 25కిపైగా ఉంటోంది.



ఒక్కోదాంట్లో నలుగురిని ఉంచి..

రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ విభాగంలోని వార్మర్లలో చికిత్స పొందుతున్న నవజాత శిశువులు వీరు. ఈ విభాగంలో మొత్తం పదిహేను వార్మర్లు ఉండగా అందులో సగం పని చేయటం లేదు. పని చేస్తున్న వార్మర్లు ఒక్కో దానిలో ఇద్దరు, ముగ్గురు అప్పుడప్పుడూ నలుగురు నవజాత శిశువులను ఉంచి చికిత్స అందించాల్సిన దుస్థితి నెలకొంది.



మూడు రోజుల కిందట మృతి చెందిన శిశువు

సీపాప్‌దీ అదే దారి..

ఎస్ఎన్‌సీయూ విభాగానికి శ్వాస సంబంధ వ్యాధులతో వచ్చే శిశువులకు సీపాప్ (శ్వాస తీసుకోవడానికి ఉపకరించే) పరికరాలు అత్యవసరం. అయితే ఆ విభాగంలో రెండు బబుల్ సీపాప్ పరికరాలు ఉన్నా అవి పని చేయటం లేదు. అక్కడ చికిత్సలు అందించే వైద్యులు వాటిని అమర్చి ఎలాగోలా పని చేసేలా ప్రయత్నిస్తే రెండు, మూడు గంటలు పని చేసి ఆగిపోతుంటాయి. దీంతో వాటిని వాడటం మానేసి మ్యానువల్‌గా సీపాప్ ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నారు. నిత్యం వార్డులో 25 నుంచి 40 మంది నవజాత శిశువులు ఉంటారు. వారికి కనీసం పది నుంచి 15 బబుల్ సీపాప్ పరికరాలు అవసరమవుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.



మూలన పడిన వెంటిలేటర్

ఎస్ఎన్‌సీయూ విభాగంలోని వెంటిలేటర్ ఇది. నవజాత శిశువులకు ఊపిరితిత్తులు, శ్వాస సంబంధ ఇబ్బందులు ఉంటే ఇందులో చికిత్స అందిస్తుంటారు. ఈ విభాగంలో రెండు వెంటిలేటర్లు ఉండగా వాటిలో ఒకటి పూర్తిగా మూలనపడిపోయింది. రెండో వెంటిలేటర్ ఎప్పుడు పని చేస్తుందో తెలియదు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలోని అలీనా అనే మహిళకు జన్మించిన మగ శిశువుకు శ్వాససంబంధ ఇబ్బందులు ఉండటంతో ఎస్ఎన్‌సీయూ విభాగానికి తరలించారు. ఆ సమయంలో వెంటిలేటర్ పని చేయలేదు. దీంతో ఆ శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

వార్మర్లకు మరమ్మతులు చేయిస్తున్నాం

- అనంత్‌రావు, ఎస్ఎన్‌సీయూ బాధ్యుడు



పని చేయని వార్మర్ల మరమ్మతులకు సంబంధిత నిపుణులకు సూచించాం. వెంటిలేటర్ల సమస్య ఉంది. కనీసం మూడు వెంటిలేటర్లు ఉంటే ఇబ్బందులు లేకుండా ఉంటాయి. బబుల్ సీపాప్‌లు సైతం అవసరం ఉన్నాయి. వాటిని కొనుగోలు చేయాల్సి ఉంది.



జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిల్వ చేసిన బతుకమ్మ చీరలు

జిల్లాకు చేరిన 66 వేల బతుకమ్మ చీరలు

ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాకు 66 వేల బతుకమ్మ చీరలు చేరుకున్నాయి. జిల్లాకు 2.02 లక్షలు రావాల్సి ఉండగా సగాని కంటే తక్కువ రావడం చర్చనీయాంశంగా మారింది. గతంలో 18 ఏళ్లు నిండి రేషన్‌కార్డులో సభ్యులుగా ఉన్న ప్రతీ మహిళ, యువతికి బతుకమ్మ చీరలను కానుకగా ఇచ్చేవారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక బతుకమ్మ చీరల పంపిణీపై సందిగ్ధత నెలకొంది. నెల కిందట సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరల స్థానంలో స్వయంసహాయక సంఘాల సభ్యులకు ఏడాదికి రెండు చీరలను అందజేస్తామని ప్రకటించారు. ఇదిలా ఉంటే జిల్లాలో స్వయం సహాయక సంఘాల సభ్యులు దాదాపు 1.40 లక్షల మంది ఉన్నారు. ఇప్పటికే బతుకమ్మ సంబరాలు ప్రారంభమై అయిదు రోజులు అవుతోంది. ఈ నేపథ్యంలో కేవలం 66 వేల చీరలే జిల్లాకు రావడం.. ఆ చీరలను ఎవరికి పంపిణీ చేస్తారో స్పష్టత లేకుండా పోయింది. ఇదే విషయమై డీఆర్‌డీవో సాయన్నను వివరణ కోరగా పంపిణీపై ఇంకా మార్గదర్శకాలు రావాల్సి ఉందన్నారు.



బతుకమ్మ చీర

సౌకర్యాలు కరవు.. సమస్యల నెలవు

ఆదిలాబాద్ గ్రామీణం, మావల మండలాలతోపాటు జిల్లాలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో సౌకర్యాలు కొరవడటంతో రిజిస్ట్రేషన్లకు, ఇతర పనులకు వస్తున్న అన్నదాతలు, భూమి, ప్లాట్లు విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఏర్పాటు సందర్భంగా రైతులు కోసం ప్రత్యేకంగా ఒక్క షెడ్డు ఏర్పాటు చేసి అన్నదాతలు కూర్చోవడానికి కుర్చీలు అందులో ఉంచారు. కాగా ప్రస్తుతం ఆ కుర్చీలు కనిపించడం లేదు. ఆ షెడ్డును వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. దీంతో పనుల కోసం వచ్చిన అన్నదాతలు ఆరుబయట, చెట్ల కింద కూర్చొని నిరీక్షిస్తున్నారు. తాగునీటి, మూత్రశాలల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



ఆరుబయట కింద కూర్చొని నిరీక్షిస్తున్న అన్నదాతలు



షెడ్డులో వాహనాల పార్కింగ్

సూపర్ మార్కెట్‌లో రూ.2.45 లక్షల చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే: మావల పోలీసు స్టేషన్ పరిధి దస్నాపూర్‌లోని సాగర్ సూపర్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పైఅంతస్తు నుంచి లోనికి చొరబడి ఉంటారన్నారు. యజమాని సాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూ.2.45 లక్షలు చోరీ అయినట్లు కేసు నమోదు చేశామన్నారు. దుకాణంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. ఎంత మంది చొరబడ్డారు? ఎలా చోరీ చేశారు? అనే వివరాలు సేకరిస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

? బేల మండల కేంద్రం అశోక్‌నగర్ కాలనీలో ప్రధాన కాలువ పూడిక తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. **-గణేష్, స్థానికుడు**

✔ పంచాయతీ కార్యదర్శికి చెప్పి మురుగు పూడిక తొలగించి శుభ్రం చేయిస్తాం. **- మహేందర్, ఎంపీడీఓ, బేల** **- న్యూస్‌టుడే, బేల**

ప్రమాద సూచిక ఏర్పాటు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఇంద్రవెల్లి నుంచి ఉట్నూరు మండలం చింతకర్ర పంచాయతీ రోడ్డు పైపడిన గండికి ఎస్సై సునీల్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. 'అదుపు తప్పితే ప్రమాదమే' అనే శీర్షికతో సోమవారం ప్రచురణ అయిన వార్తకు ఎస్సై స్పందించారు. సోమవారం ఉదయం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నేలకొరిగిన చెట్ల కొమ్మల తొలగింపు

వందనం

బేల, న్యూస్‌టుడే: మండలంలోని సిర్సన్న నుంచి టాక్లి బస్టాండ్ వరకు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా తొలగించిన కొమ్మలు, కర్రలను నెల రోజులుగా రహదారి పక్కనే ఉంచగా సోమవారం తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రయాణికులు తమ సమస్యలను 'ఈనాడు' దృష్టికి తీసుకురావడంతో సోమవారం 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. జాతీయ రహదారుల సంస్థ అధికారులు స్పందించి రహదారి పక్కనే ఉన్న చెట్ల కొమ్మలను, కర్రలను తొలగించారు.



బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతున్న మహిళా ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగుల బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలతో తయారు చేసిన భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. డీజే పాటలకు మహిళా ఉద్యోగులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. రీజనల్ మేనేజర్ సోలోమన్, పీఓ జిబ్లా, డీఎం కల్పన, ఎంఎఫ్ శ్రీకర్, స్టేషన్ మేనేజరు శ్రీనివాస్, మహిళా ఉద్యోగులు విజయశ్రీ, వరలక్ష్మి, వందన, భాగ్యవతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పండగపూట పస్తులు ఉండాల్సి వస్తోందని పాలనాధికారిని కలిసి తమ గోడును వివరించారు. ఈ నెల 11వ తేదీలోగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని డీపీవో శ్రీలతను ఆయన ఆదేశించారు.

పాలస్తీనీయులపై దాడులు అమానుషం

ఎదులాపురం, న్యూస్‌టుడే: పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ ఏడాది కాలంగా దాడులు చేసి ఆదేశ పౌరులను హతమార్చటం అమానుషమని వామపక్షాల నాయకులు విమర్శించారు. దాడులను ఆపాలంటూ నిరసన వ్యక్తం చేస్తూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి, ఆ దేశ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినరూ.. పరిష్కారం చూపరూ..

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: రుణమాఫీ కాలేదని కొందరు.. మద్యం గొలుసు దుకాణాలు ఎత్తివేయాలని మరికొందరు.. తమను రిలీవ్ చేయాలని ఏకోపాధ్యాయులు, అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఇంకొందరు.. ఇలా ఆయా సమస్యలను అర్జీదారులు ప్రజావాణిలో విన్నవించారు. పాలనాధికారి రాజర్షిషా, అదనపు పాలనాధికారి శ్యామలదేవి అర్జీలు స్వీకరించారు.



గొలుసు దుకాణాలు ఎత్తివేయాలి

తెల్లకల్లు, బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ సభ్యులు పాలనాధికారిని కోరారు. మద్యానికి బానిసలై యువత చనిపోతున్నారని రాయిసెంటర్ సార్‌మేడి జుగ్నాక్ సంభు పేర్కొన్నారు.

పింఛను ఇప్పించండి..

దివ్యాంగురాలైన కూతురు రుక్మిణికి పింఛను రావడం లేదని గాదిగూడ మండలం మేడిగూడ గ్రామవాసి గోపినాథ్ పేర్కొన్నారు. దివ్యాంగపత్రం ఉన్నా పింఛను మంజూరు కాలేదని పాలనాధికారికి విన్నవించారు.

అక్రమ నిర్మాణాన్ని కూల్చేయండి

ఆదిలాబాద్ పట్టణం తాంసి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేసి ఆ స్థలం స్వాధీనం చేసుకోవాలని విన్నవించారు.

రిలీవ్ చేయండి

బదిలీ అయిన తమను రిలీవ్ చేయలేదని ఇచ్చోడ, బేల మండలాల్లో పని చేస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాలల టీచర్లు విన్నవించారు.

స్పందించి.. ఆదేశించి..

బేల మండలం దహెగాంకు చెందిన దివ్యాంగ రైతు వాంకడే నారాయణ తన వ్యవసాయ విద్యుత్తు కనెక్షను పునరుద్ధరించాలని ప్రజావాణిలో పాలనాధికారి రాజర్షిషాకు విన్నవించారు. అప్పటికప్పుడే విద్యుత్తు శాఖ అధికారిని పిలిచి మండల ఏఈతో ఫోన్‌లో మాట్లాడారు. కనెక్షను పునరుద్ధరించినట్లు ఫొటోలు తనకు పెట్టాలని ఆదేశించారు.

నిధులు ఇవ్వరూ..

పాఠశాలలో శుద్ధజల ప్లాంటు కోసం ప్రత్యేక నిధుల నుంచి డబ్బులు ఇప్పించాలని యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గంగన్న కోరారు.



రుణమాఫీ కాలేదని..

తమకు రుణమాఫీ కాలేదని గాదిగూడ మండలం అర్జునికొలాంగూడ ఆదివాసీలు వాపోయారు. అందరికీ రూ.2లక్షలలోపే రుణాలు ఉన్నాయని తెలిపారు. తమతోపాటు రుణాలు తీసుకున్న వారివి మాఫీ అయ్యాయని పేర్కొన్నారు.

ఈడబ్ల్యూఎస్‌లో నకిలీలు



డీఎస్సీలో ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ జరిపించాలని అభ్యర్థులు పి.నవనీత్‌రెడ్డి, ఎస్.రవితేజరెడ్డి ఫిర్యాదు చేశారు. అనర్హులు ఆ పత్రాలు పొంది ఉద్యోగానికి ఎంపికైనట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

విద్యాశాఖ వివాదంపై ఆర్జేడీ ఆరా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యాశాఖ కార్యాలయంలో ఇటీవల చోటు చేసుకున్న వివాదంపై వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఆరా తీశారు. అధికారిపై అనుచితంగా వ్యవహరించిన ఉద్యోగులకు మెమోలు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు ఇంటెలిజెన్స్‌వర్గాలు సైతం డీఈవో శాఖలో అక్రమ వసూళ్ల దందాపై కూపీ లాగినట్లు తెలిసింది. ఈ సెక్షన్‌లో ఏ ఉద్యోగి వసూళ్లకు పాల్పడుతున్నది ఉపాధ్యాయ వర్గాలను అడిగి తెలుసుకున్నారు. ఓ పాఠశాల అనుమతి దస్త్రం ఆమోదం విషయంలో ఇటీవల అధికారినే కింది స్థాయి ఉద్యోగులు నిలదీయడం.. తమకు రావాల్సిన డబ్బులను మీరే తీసుకున్నారంటూ వాదనకు దిగడం.. చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. డీఎస్సీ నియామక ప్రక్రియ అనంతరం చర్యలు ఉండొచ్చని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి.

ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదివాసీల సమస్యలు పరిష్కరించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా నాయకులు పుర్క బాపురావు, కొడప నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం తుడుందెబ్బ ఆదివాసీ సంఘాల నాయకులు ఐటీడీఏ ముందు ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీ సంఘాలు, తుడుందెబ్బ నాయకులతో కలిసి చర్చలు జరుపుతామనడం శుభ సూచికమన్నారు. జైనూర్ ఘటన బాధ్యుడిని ఉరి తీయాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలోని సివిల్ కేసులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిష్కరించేలా ప్రభుత్వం జీవో జారీ చేయాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాను వినతిపత్రం అందించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నడుస్తున్న బెల్టుషాపులను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉట్నూరు డీఎస్పీ నాగేందర్‌లకు వినతిపత్రం ఇచ్చారు. కుడ్మెత తిరుపతి, సోయం రాందాస్, దత్తు, గేడం భరత్, జంగుదేవ్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ముందు ధర్నా చేస్తున్న తుడుందెబ్బ ఆదివాసీ సంఘాల నాయకులు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు

ఉట్నూరు, న్యూస్‌టుడే : గిరిజనుల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరిగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ గిరిజనుల అర్జీలు స్వీకరించారు. ఉట్నూరు మండలం బీర్సాయిపేటకు చెందిన కుమురం రాంబాయి జీవనోపాధికి గొర్రెల పెంపకానికి నిధులు, ఆదిలాబాద్ మండలం తలమద్రికి చెందిన నాగోరావు ట్రైకార్ ద్వారా నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. లింగాపూర్ మండలం మేడిగూడకు చెందిన తొడసం భగవంత్‌రావు వ్యవసాయం కోసం భూమి ఇప్పించాలని, తిప్పరాజుగూడకు చెందిన కొడప భీంరావు వ్యవసాయానికి ఎడ్లు మంజూరు చేయాలని కోరారు. వారితోపాటు పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

భీంపూర్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి

భీంపూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండలవాసులు జూనియర్ కళాశాల మంజూరు చేయించాలని విన్నవించారు. కరంజి-టి, అర్లి-టి, భీంపూర్, అందర్‌బంద్, పిప్పల్‌కోటి గ్రామాల్లో ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, ఏటా 200 మందికిపైగా విద్యార్థులు పదోతరగతి చదివి దూరభారంతో కళాశాల విద్యకు దూరమవుతున్నారని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లింబాజీ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గతంలో కళాశాల ఏర్పాటుకు రెండెకరాల భూమిని కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకులు కుమ్ర సుధాకర్, లస్మన్న, నాగయ్య, రవీందర్ జాదవ్, రవూఫ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మండలవాసులు



సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

తాంసి, న్యూస్‌టుడే : సోయా కొనుగోళ్లలో ఎలాంటి నిబంధనలు లేకుండా రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం తాంసి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ ఛైర్మన్ అడ్డి బోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం తాంసి రెవెన్యూ కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. పొన్నారిలో మహిళా స్వయం శక్తి పథకంలో భాగంగా స్టీల్ బ్యాంకును ప్రారంభించారు. సీఈఓ కేశవ్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ ఏపీఎం రవీందర్, ఏఓ రవీందర్ తదితరులు ఉన్నారు.

భూదస్త్రాల తరలింపు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లాకు సంబంధించిన భూకొలతల దస్త్రాలను సోమవారం ఆదిలాబాద్ నుంచి తరలించారు. మండలాలవారీగా ఉన్న దస్త్రాలను మూటలుగా కట్టి జాగ్రత్తగా ప్రత్యేక వాహనంలో పంపించారు. జిల్లాల విభజన తర్వాత ఏదైనా సమాచారం కావాలంటే మంచిర్యాల జిల్లావాసులు ఇక్కడి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దూరభారంతోపాటు వ్యయప్రయాసలకోర్చి వస్తుండటంతో ఆ ఇబ్బందులు దూరం చేసేలా అక్కడి అధికారులు దస్త్రాల తరలింపునకు ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. ఫలితంగా మంచిర్యాల జిల్లావాసుల కష్టాలు దూరం కానున్నాయి. తొలిసారి 1954లో జరిగిన సర్వేకు సంబంధించి దస్త్రాలు ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా తరలిస్తున్నట్లు భూకొలతల శాఖ కార్యాలయ దస్త్రాల విభాగాధికారి తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇకపై మంచిర్యాల జిల్లా వాసులు ఆదిలాబాద్‌కు రావాల్సిన అవసరం లేదని చెప్పారు.



దస్త్రాలను తరలిస్తున్న సిబ్బంది

నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసే ముఠా అరెస్టు

ఎదులాపురం, న్యూస్‌టుడే: అసలైన బంగారంలా నమ్మించి నకిలీ బంగారాన్ని అంటగట్టి మోసం చేసే ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ సునీల్‌కుమార్‌తో కలిసి ఆయన సోమవారం మాట్లాడుతూ అనంతపూర్ జిల్లా కూడేరు మండలం కళగల గ్రామానికి చెందిన ఈ.నాగరాజు, కర్నూల్‌కు చెందిన దేవర తిమ్మరాజు, ఈ.సుధాకర్, గోపాల్, కారు డ్రైవర్ ప్రవీణ్(బళ్లారి-కర్ణాటక)కు చెందిన అయిదుగురు ముఠాగా ఏర్పడి వ్యాపారులకు నకిలీ బంగారం చూయించి అసలైనదిగా నమ్మించి మోసం చేస్తుంటారని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని రాధాకృష్ణ లాడ్జిలోకి ఈ.నాగరాజు, దేవర తిమ్మరాజులు వెళ్లి అక్కడ ఉన్న రిసెప్షనిస్ట్‌తో తమకు గది కావాలని చెప్పి పైనున్న గదిలోకి అతడిని తీసుకెళ్లారు. వెంటనే రెండో బ్యాచ్‌లోని ఇద్దరు కౌంటర్ వద్దకు చేరుకొని నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించగా అది తెరుచుకోలేదు. దీంతో అక్కడున్న విజిటర్స్ దస్త్రాలను తస్కరించి తీసుకెళ్లారు. అనంతరం మొదటి బ్యాచ్ వారు తమకు గది నచ్చలేదని వెళ్లిపోయారు. రిసెప్షనిస్ట్ కౌంటర్ వద్దకు వచ్చి చూడగా విజిటర్స్ పుస్తకాలు కనబడకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సోమవారం ఈ.నాగరాజు, దేవర తిమ్మరాజును పట్టుకుని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారయ్యారు. ఆ ముఠా లాడ్జీల్లో ఇలా సందర్శకుల పుస్తకాలు చోరీ చేసి అందులో ఉండే చరవాణి నెంబర్లకు ఫోన్లు చేసి తమకు తవ్వకాల్లో బంగారం దొరికిందని చెప్పి నమ్మించి నకిలీ బంగారం అంటగడుతుంటారని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుల్లో నాగరాజు ఇది వరకే మూడు కిలోల నకిలీ బంగారం విక్రయించి వ్యాపారి నుంచి రూ.5 లక్షలు కాజేసిన కేసులో మంథని పోలీసులు అరెస్టు చేశారన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలో విద్యుత్తు కోతలు: ఎమ్మెల్యే



తలమడుగు, న్యూస్‌టుడే: భారాస అధికారంలో ఉన్న తొమ్మిది సంవత్సరాలు రెప్పపాటులో కూడా విద్యుత్తు పోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నుంచి విద్యుత్తు కోతలు ఎక్కువయ్యాయని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం తలమడుగు మండలంలోని సుంకిడిలో పర్యటించిన ఆయన దుర్గామాత, శారదదేవీలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, భారాస నేతలు కేదారేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రకాశ్, ఆశన్నయాదవ్, సునీతారెడ్డి, ప్రసూన్‌రెడ్డి, అజయ్, మహేష్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు రూ.70 వేల చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఆర్థికసాయం అందజేత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికార సంఘం భవనంలో ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తూ మృతి చెందిన నవీన్ కుటుంబీకులకు ఉద్యోగులు ఆసరాగా నిలిచారు. రూ.70 వేల ఆర్థికసాయం చేశారు. ఆ చెక్కును మృతుడి తండ్రి లింగన్నకు టీఎన్జీవోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, నవీన్‌కుమార్, గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు శివకుమార్, రాజేందర్‌దేశ్ పాండే, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భుక్తాపూర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాంనగర్ కాలనీకి చెందిన మెట్‌పల్లి రాజు ఏడు నెలల కిందట పక్షవాతానికి గురయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి అభిమాన్ సోమవారం బాధిత కుటుంబానికి రూ.22 వేల నగదు అందజేశారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

సొనాల(బోథ్), న్యూస్‌టుడే: బోథ్ మండలం సొనాలలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గ్రామంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులగుండా రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలను ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో రథం ముందు కదిలారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.వి.రమణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.



సొనాలలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

మొక్కు తీర్చుకున్న ఎంపీ నగేష్

నార్నూర్, న్యూస్‌టుడే : మండలంలోని మహాగావ్ గ్రామాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ సోమవారం సాయంత్రం సందర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే బాలాజీ మందిరానికి వస్తానని చెప్పిన ఆయన ఈమేరకు ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. అనంతరం భాజపా రాష్ట్ర నాయకుడు జాదవ్ రెడ్డినాయక్ ఇంట్లో గ్రామస్థులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామస్థులు, యువత కలిసి గెలుపు కోసం చేసిన కృషి అభినందనీయమన్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి మహాగావ్ తండా వరకు రహదారిని నిర్మించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. గంగాపూర్ నుంచి మహాగావ్ నూతన రహదారికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని, నార్నూర్ మండల కేంద్రంలో శ్రీసంత్ సేవాలాల్ భవ్య మందిర నిర్మాణానికి పీఎం మోదీతో చర్చించి మంజూరు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొడసం బండు, జాదవ్ దేవిదాస్, ఉపాధ్యక్షుడు భిక్కు రాథోడ్, గ్రామ పెద్దలు రాథోడ్ ఈశ్వర్‌దాస్ నాయక్, భగవాన్‌దాస్ నాయక్, దేవిదాస్ చవాన్, సచిన్ జాదవ్, పర్శురామ్, హరిచంద్ చవాన్ పాల్గొన్నారు.



ఎంపీ గోడం నగేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

క్రీడలతో మానసికోల్లాసం

నార్నూర్, న్యూస్‌టుడే : యువత క్రీడలతోపాటు విద్యపై దృష్టి సారించాలని నంగారాభేరి ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాధ్యక్షుడు జాదవ్ సంజీవ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని రాజులగూడ గ్రామ క్రికెట్ క్రీడాకారులకు ఏకరూప దుస్తులను అందజేశారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఉట్నూర్‌లో కొనసాగుతున్న యూసీటీ క్రికెట్ పోటీల్లో నార్నూర్ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

విద్య, ఉద్యోగ రంగాల్లో అన్యాయం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పి ఉద్యోగ ప్రకటనలు భర్తీ చేస్తుండటంతో మాదిగలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ కూడలిలో ఎమ్మార్పీఎస్ జెండా వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువరించాక సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని, ఇప్పటి దాకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈనెల 9న పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీయనున్నట్లు పేర్కొన్నారు. మాదిగ ఉపకులాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. నాయకులు మనోజ్, ఎల్లన్న, గణేష్, సూర్యకాంత్, వేణు, రాజు, ఇస్తారి, రాకేష్, లక్ష్మణ్, గణేష్, దీపక్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



అర్లి-టిలో పూజలు చేయిస్తున్న గోపాలకృష్ణ మఠాధిపతి యోగానందసరస్వతి



ఇంద్రవెల్లి : రాధాకృష్ణ మందిరం వద్ద..



రుయ్యాడిలో పూజలు నిర్వహిస్తున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి

సామూహిక కుంకుమార్చనలు.. ప్రత్యేక పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆయా ఆలయాల్లో, దుర్గమ్మ మండపాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వైదిక పురోహితులు గొంగళ్ల ప్రవీణ్ స్వామి పూజా విధానం, వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు. దుర్గాదేవి మండపాల వద్ద రాత్రి మహిళలు, యువతులు ప్రత్యేకంగా దాండియా నృత్యాలు చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, బృందం



ఉట్నూరు : వేణునగర్‌లో..



జిల్లా కేంద్రం విద్యానగర్ కాలనీలోని దాసాంజనేయ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు

సంక్షిప్తం

ముగ్గురిపై కేసు నమోదు

బోథ్: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, నిరాధార వార్తలను వ్యాప్తి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోథ్ సీహెచ్‌సీలో గత మార్చిలో వైద్యులు శస్త్రచికిత్స చేయటంతో ఓ మహిళ మృతి చెందిందని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు సృష్టించారని సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలనాప్రాంగణం: ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం అందజేశారు. నాయకులు లాలామున్నా, రఘుపతి, ప్రవీణ్, కృష్ణయాదవ్, రాము పాల్గొన్నారు.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని ప్రధానికి లేఖ

బజార్‌హత్నూర్: ఏజెన్సీలోని గిరిజనేతరుల సమస్యల పరిష్కారానికి ప్రధాని నరేంద్ర మోదీ చొరవ చూపాలని మండల కేంద్రానికి చెందిన యువకుడు చట్ల తరుణ్ సోమవారం ప్రధానమంత్రి కార్యాలయానికి ఉత్తరం రాశారు. ఏళ్లుగా గిరిజనేతరులు పడుతున్న ఇబ్బందులను అందులో పేర్కొన్నారు.

అలరించిన శ్రీధర్ బృందం ప్రదర్శన

ఇచ్చోడ: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తమిళనాడు కోయంబత్తూర్‌లోని ఈషా యోగా సెంటర్లో నిర్వహించిన వేడుకల్లో ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ గ్రామానికి చెందిన సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లె శ్రీధర్ బృందం పాల్గొన్నారు. సంస్కృతిక ఖిక్రి, డెంసా, గుస్సాడి నృత్యాలు చేసి అలరించారు. లక్ష్మణ్, ప్రకాష్, గంగారాం, రాము ఉన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులకు మోక్షం

పాలనాప్రాంగణం: పాలనాధికారి రాజర్షిషా చొరవ, ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఒత్తిడి మేరకు గతంలో మంజూరైన రూ.18 కోట్ల పనులకు టెండర్ పూర్తయింది. ఈదుల్లా సావర్గాం నుంచి నిపాని వరకు మూడు కిలోమీటర్లు, దనోర నుంచి అర్లి-టి వరకు ఆరు కిలోమీటర్ల మేర తారు రోడ్డు పనులు జరగనున్నాయి. పిప్పల్‌కోటి, నిపాని, వడూర్, అర్లి-టి మార్గంలో శిథిలావస్థకు చేరిన వంతెనల నిర్మాణం కూడా పనుల్లో భాగంగా చేపట్టనున్నట్లు ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య తెలిపారు. అర్లి-టి నుంచి కరంజి-టి వరకు మిగిలిన పనులకు నిధులు విడుదల చేయిస్తానని ఎమ్మెల్యే సోమవారం మండల పర్యటనలో భాగంగా భీంపూర్‌కు వచ్చిన సందర్భంగా ప్రకటించారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మంత్రి సీతక్కను కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను ఆమెకు వివరించారు.



మంత్రి సీతక్కతో కంది శ్రీనివాసరెడ్డి

మద్దతు ధర దక్కాలంటే..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : పంటలు చేతికొస్తున్నాయి. క్రయవిక్రయాలు ప్రారంభమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలి. నాణ్యతను పాటిస్తే మద్దతు ధరను పొందే అవకాశం ఉంది. ధర నిర్ణయంలో తేమకు ప్రాధాన్యం ఎక్కువ ఉంటుంది. పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మొదలైన నేపథ్యంలో నాణ్యత, మద్దతు ధరలు పంట విక్రయాలు, కోతలు తదితర వాటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్కెట్ ఏడీ గజానంద్ సూచనలు చేశారు.



పత్తిలో తేమ నిర్ధారణ ఇలా

కోతలో జాగ్రత్తలు

రైతేరాజు

గిట్టుబాటు ధర రావాలంటే రైతులు కోత దశ నుంచి జాగ్రత్తలు తీసుకుంటే పంట నాణ్యతగా ఉంటుంది. ప్రస్తుతం చలికాలం కావున పత్తి ఎండపూట ఏరాలి. పత్తిని కుప్పగా వేయడం వల్ల తేమ అందులోనే ఉండి పత్తి చెడిపోవడమే కాకుండా ధర కూడా రాదు. పత్తి ఏరిన తర్వాత ఆరబెట్టి తీసుకొస్తే తేమ తగ్గుతుంది. వరి పైరు కోసిన తరువాత తేమ తగ్గేందుకు పొలంలో కోసిన చోటనే ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ ఒక్కసారిగా తగ్గకూడదు. క్రమక్రమంగా తగ్గాలి. సాధారణమైన ఎండలో పొడిగాలి సన్నగా వస్తున్నప్పుడు ఆరబెట్టాలి. ధాన్యంలో తేమ శాతం 14-16 శాతం ఉండేట్లు చేయడం వల్ల ధాన్యం ఎక్కువ కాలం నిల్వ చేసుకోవచ్చు. మొక్కజొన్న, సోయా, ఇతర పప్పుదినుసుల పంటలు కోతల తరువాత రెండు, మూడు రోజులు ఆరబెట్టి తరువాత నూర్పిడి చేయాలి. తిరిగి రెండు రోజులు గింజలను ఆరబెడితే తేమ పూర్తిగా తగ్గి గిట్టుబాటు ధర వస్తుంది.

నాణ్యత నిర్ధారణ ఇలా..

పత్తిలో తేమ శాతం ఆధారంగా ధర నిర్ణయిస్తారు. 8 శాతం తేమ ఉన్న పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 వస్తుంది. ప్రతి ఒక శాతానికి కిలో ధర తగ్గించి ఇస్తారు. అది కూడా 12 శాతం తేమ వరకే కొనుగోలు చేస్తారు.

- సోయాబీన్‌లో 12 శాతం తేమ లోపు ఉండాలి. చెత్తాచెదారం, పగిలిన గింజలు మూడు శాతం లోపు ఉండాలి.
- మొక్కజొన్నలో 12 శాతం తేమ లోపు ఉండాలి. వేరే పంట పదార్థాలు 0.25-0.75 శాతం వరకు ఉండొచ్చు. దెబ్బతిన్న గింజలు ఒక శాతం లోపు ఉంటే ఫరవాలేదు.
- పప్పుదినుసుల్లో 12 శాతం, ధాన్యంలో 14 శాతం తేమ లోపు ఉండాలి. అంతకంటే తేమ ఎక్కువగా ధరలో కోత విధిస్తారు. ప్రతి పంటలో తేమను నిర్ధారించే పరికరాలు ఉంటాయి. వాటితో తేమ శాతాన్ని పరిశీలించి ధరను నిర్ణయిస్తారు.

రైతు ప్రశ్న – శాస్త్రవేత్త సమాధానం



రాజశేఖర్, కీటక శాస్త్రవేత్త
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్
ఫోన్ నెంబరు : 99085 56659

పత్తి పంటలో కాయకుళ్లు ఆశించింది. నివారణ సూచించండి? - చంద్రశేఖర్, బేల

ఫ్లూక్సాపైరాక్సాడ్+ పైరాక్లోస్ట్రోబిన్ 0.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కందిలో ఆకులు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. పంటను కాపాడుకోవడం ఎలా? - నాగోరావు, గుడిహత్నూర్

19.19.19 పది గ్రాములు+ఫార్ములా 4 అయిదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

టమాటాను పిన్‌వార్మ్ ఆశించింది. నివారణ సూచించండి? - రవీందర్, మన్నూర్, గుడిహత్నూర్

ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా ఇండాక్సికార్బ్ 1.75 మి.లీ లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు మందులను మార్చి, మార్చి పిచికారీ చేయాలి.

తక్కువ విస్తీర్ణంలో.. విభిన్న రకాల సాగు

ఏకొద్దిగా చేను ఉన్నా వరి లేదా పత్తి సాగు చేస్తున్న ప్రస్తుత తరుణంలో దండేపల్లికి చెందిన ఎనగందుల భూమయ్య ఉన్న తక్కువ విస్తీర్ణంలో విభిన్న రకాల కూరగాయలు, పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయనకు 26 గుంటల పొలం ఉండగా ఇందులో వరి సాగు చేస్తున్నారు. ఇంటి సమీపంలో ఉన్న 14 గుంటల్లో ఉన్న పెరడులో కూరగాయలు, పూల సాగు చేస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో బెండ, వంకాయ, అలుగు తదితర కూరగాయలు సాగు చేస్తారు. వీటిని స్థానిక సంతకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.. చాలా మంది ఇంటికే వచ్చి తీసుకెళ్తుంటారు. పంట చేతికి రాగానే తీసేసి పూలను సాగు చేస్తారు.. గతేడాది సీతమ్మ జడలు, బంతి తదితర పూలు సాగు చేయగా ఈసారి సీతమ్మ జడలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ, దీపావళి తదితర పండగలకు పూలు చేతికి వస్తాయి. దీంతో ఆదాయం సమకూరుతుంది. సీజన్ పూర్తి కాగానే తిరిగి కూరగాయలు సాగు చేస్తారు. ఇలా వేసవి పూర్తయ్యే వరకు రెండు సార్లు వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో వరితో పాటు పూలు, కూరగాయలు సాగు చేస్తూ ఆదాయం పొందుతున్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం



పూలసాగు చేస్తున్న భూమయ్య

అదృశ్యం

నాణ్యమైన నారు కావాలంటే..

మీకు తెలుసా?

కూరగాయలను కాలంతో సంబంధం లేకుండా సాగు చేస్తుంటారు. యాజమాన్య పద్ధతులు పాటించి కూరగాయల నారు పెంచితేనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి అనిత పేర్కొన్నారు. పాలీహౌస్, షేడ్ నెట్లలో పెంచితే నాణ్యమైన నారు వస్తుంది. కూరగాయలకు కోకోపిటు మిశ్రమం టన్నుకు కిలో విత్తనాలు విత్తే పది రోజులు ముందు కలిపితే నారు కుళ్లు తెగులు నివారించవచ్చు. కిలో విత్తనశుద్ధికి నాలుగు గ్రాముల ట్రైకోడెర్మా 1.5 గ్రా. ఉపయోగించాలి. నారు పెరిగే సమయంలో కుళ్లు తెగులు ఆశించకుండా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి చల్లుకోవాలి.

- న్యూస్‌టుడే, దండేపల్లి

చిచ్చర పిడుగులు.. క్రికెట్‌లో వీరులు

● ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయికి ఎంపిక

న్యూస్‌టుడే, మంచిర్యాల క్రీడావిభాగం:



జిల్లా కేంద్రంలోని క్రికెట్ శిక్షణ కేంద్రంలో క్రీడాకారుల సాధన

వ్యక్తిగత క్రీడల్లో రాణించడం.. ఉన్నతస్థాయికి చేరుకోవడం వారి స్వీయ శిక్షణ, సాధనపై ఆధారపడి ఉంటుంది. కానీ గ్రూపుగా తలపడే క్రీడలో చోటు దక్కించుకోవడం అంత సులువేం కాదు. నిత్యం కసరత్తు చేయాలి.. తనకంటూ ప్రత్యేకత చాటుకోవాలి. మెరుగైన ప్రదర్శనతో సెలక్టర్లను ఆకట్టుకోవాలి. ముఖ్యంగా క్రికెట్ జట్టుకు ఎంపిక అవడమంటే ఆశామాషీ వ్యవహారమేమీ కాదు. అలాంటి ఈ ఆటలో పదిహేనేళ్లు కూడా నిండని జిల్లాకు చెందిన చిన్నారులు సత్తాచాటుతూ ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తమ ఆటతీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో తలపడేందుకు సిద్ధమవుతున్నారు.

బ్యాటింగ్‌లో మెరిసి.. రాష్ట్ర స్థాయికి చేరి



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న వేములపల్లి లక్ష్మణ్ సాయి బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. కుడి చేతి వాటంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఇటీవల పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వహించిన జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. తొలిసారి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో పాటు జట్టులో కీలకమయ్యాడు. గురు అకాడమీలో శిక్షణ పొందుతున్న లక్ష్మణ్ ఆయా పోటీల కోసం ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తున్నాడు.

ఎడమ చేతి వాటం.. ఆల్‌రౌండ్ ప్రతిభ



కొంతకాలంగా మంచిర్యాల పట్టణంలోని అకాడమీలో శిక్షణ పొందుతున్న ఎడ్ల రిషికేష్‌చంద్ర తన ఎడమచేతి వాటం బ్యాటింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. బ్యాటింగ్‌లో చూడచక్కని షాట్లు.. లైన్ అండ్ లెన్త్ బౌలింగ్‌తో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాడు. గతేడాది సైతం ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకోగా ఈ ఏడాది మరింత మెరుగైన ప్రదర్శనతో ఉమ్మడి జిల్లా జట్టును విజయతీరాలకు చేర్చాలని సిద్ధమవుతున్నాడు.

బ్యాటింగ్‌లో ధనాధన్.. కీపింగ్‌లో మెరుపు వేగం



ఓపెనర్‌గా వచ్చిరావడంతోనే తనశైలిలో దంచికొట్టడం పులిపాక వికాస్ సొంతం. బౌలర్ ఎవరైనా, బంతి ఎంత వేగంతో వచ్చినా స్టాండ్స్‌లోకి పంపడమే అతనికి తెలుసు. ఆ ఆటతీరుతోనే జిల్లా, జోనల్ స్థాయిలో సత్తాచాటి తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బ్యాటింగ్‌లో రాణించడమే కాకుండా కీపింగ్‌లోనూ జట్టుకు అదనపు బలం చేకూరుస్తున్నాడు.

తండ్రి శిక్షణ.. మెరుగైన ప్రదర్శన



జిల్లాలోని రామకృష్ణాపూర్ క్రికెట్ జట్టు అంటే బింగి దుర్గాప్రసాద్‌ను గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. తన బ్యాటింగ్‌తో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. విశ్వవిద్యాలయ కెప్టెన్‌గా వ్యవహరించి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అతని అడుగుజాడల్లోనే నడుస్తూ కుమారుడు అర్జున్ రాణిస్తున్నాడు. తండ్రి శిక్షణలోనే మెలకువలు నేర్చుకుంటూ మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నాడు. మరోసారి ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో జట్టులో కీలక సభ్యుడు కాగా అందుకు తగ్గట్లుగా ముమ్మర సాధన చేస్తున్నాడు.



దుబాయ్ స్టేడియంలో బతుకమ్మ ఉత్సవంలో వివిధ జిల్లాల వాసులు



నృత్యం చేస్తున్న మహిళలు, పిల్లలు



బతుకమ్మ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న డోలు కళాకారులు

ఎడారి నేలపై పూల పండగ

మామడ, మందమర్రి పట్టణం-న్యూస్‌టుడే : ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక, సంక్షేమ సంఘం(ఈటీసీఏ) ఆధ్వర్యంలో దుబాయ్‌లో బతుకమ్మ సంబురాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు ఈ కార్యక్రమాన్ని అక్కడి అల్ అహ్లీ ఇండోర్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు పెద్ద సంఖ్యలో ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో దుబాయ్‌లో ఏటా నిర్వహించే పూలపండగకు ముఖ్య అతిథిగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. బతుకమ్మ ఉత్సవాలు ఆకట్టుకున్నాయని నిర్మల్‌కు చెందిన రాజు, రాజశేఖర్ తెలిపారు. ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, కళాకారులు, సందడి చేసినట్లు జిల్లావాసులు వివరించారు.

పాత పింఛను హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

జన్నారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పాత పింఛను విధానాన్ని తీసుకురావాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. జన్నారంలో సోమవారం సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని ఆయన పేర్కొన్నారు. మేనిఫెస్టోకు అనుకూలంగా జీవోను విడుదల చేసి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన ఝార్ఖండ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పాత ఫింఛన్ విధానం అమలు చేశారన్నారు. 1.9.2004కు ముందు విడుదలైన ఉద్యోగ ప్రకటన ద్వారా నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్వర్వులు 57/5 ప్రకారం పాత పింఛన్ విధానం అమలుతో ఇతర రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగులకు మేలు జరిగిందని అన్నారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దసరా పండగ కానుకగా పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన కోరారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బోధిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానోత్ ప్రకాశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమలికొండ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



జన్నారంలో మాట్లాడుతున్న సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్

ఆమె చేతుల్లో.. అద్భుత కళా నైపుణ్యం

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలని ఆలోచించారు ఈ అతివలు. కుట్లు, అల్లికలు కాకుండా భిన్నంగా తమకంటూ ప్రత్యేకత చాటుకొనేలా వస్తువుల తయారీ మార్గాన్ని ఎంచుకొన్నారు. గృహాలంకరణకు ఉపయోపడే వివిధ రకాల వస్తువులు, దేవుళ్ల ప్రతిమలు తయారు చేస్తూ అబ్బురపరుస్తున్నారు.

దూదితో వస్తువుల తయారీలో భాగ్యలక్ష్మి

ఉట్నూరు మండలం లక్కారం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి కిరాణ దుకాణం నడిపించే తన భర్త వట్టం వార్ ప్రసాద్‌కు వ్యాపారంలో సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఖాళీ సమయంలో ఇంట్లో దూదితో అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. దేవుళ్ల ప్రతిమల అలంకరణ కోసం మాలలు, నల్లపూసల గొలుసులు, నెక్లెస్‌లను తయారు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో వినూత్న వస్తువులు తయారు చేయడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నానని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు.



పాడైన వస్తువులు వినియోగంలోకి తెస్తూ..

ఇంద్రవెల్లి మండలానికి చెందిన శశికళ తన భర్త చంద్రబాన్ ప్రోత్సాహంతో పాడైన వస్తువులతో ఆకర్షణీయమైన గాజులను తయారు చేస్తున్నారు. పాడైన వస్తువులను సేకరించి వాటితో ఆకట్టుకొనేలా గాజులు తయారు చేస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు.




ఆకట్టుకునేలా వస్తువుల అలంకరణలో స్వప్న

ఉట్నూరుకు చెందిన స్వప్న గృహిణి. పండగలు, శుభకార్యాల కోసం పూలు, ఇతర వస్తువులతో ఆకర్షణీయంగా వస్తువులను అలంకరిస్తారు. తన భర్త సునీల్ కుమార్ ప్రోత్సాహంతో వినాయక చవితి, దుర్గాదేవి నవరాత్రుల వేళ దేవుని ప్రతిమలకు సమర్పించే హారతి, లడ్డులు, మహిళలకు వేసే వివిధ రకాల మెహందీ డిజైన్ల అలంకరణ ఆకట్టుకునేలా చేపడుతున్నారు.



ప్రతిమల రూపకల్పనలో నాగమణి

గౌరీ దేవి(గౌరమ్మ), వినాయకుడు, దుర్గాదేవి ఇలా ఏ దేవుళ్ల ప్రతిమ అయినా పసుపు, మైనంతో ఉట్నూరుకు చెందిన నాగమణి తయారు చేస్తున్నారు. భర్త తాటికొండ రమేష్ వ్యాపారస్థుడు. ఆయనకు చేదోడువాదోడుగా ఉంటూనే నాగమణి గాజు ముక్కలతో ఓం, శివలింగం ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు.





ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రం ఏర్పాటు

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లోని ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ఔషధాల కొరత ఉన్నట్లు సమాచారం వస్తుండటంతో సమస్యను పరిష్కరించటానికి ప్రతి జిల్లాలో ఔషధ నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో సమస్యలను తెలుసుకోవటానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు తాను జిల్లాలో ఆసుపత్రులను పరిశీలించడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఔషధ నిల్వ కేంద్రాల్లో కొరత ఉన్న మందులను కొనుగోలు చేయటానికి వీలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇవి జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రిమ్స్‌తో పాటు అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సౌకర్యాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్, ఆర్ఎంఓ తొడ్సం చందు, వైద్యులు తిప్పెస్వామి, సందీప్ జాదవ్ తదితరులున్నారు.



రిమ్స్ అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చందుల స్వామి తెలిపారు. జూనియర్స్ విభాగంలో వివిధ బరువుల్లో (44-46లో) వి.అక్షయ, (50-53లో) పి.అభినయ, (60-63లో) బి.శ్రావణి వెండి పతకాలు, (44-46లో) ఎం.వైష్ణవి, (46-48లో)ఎన్.జ్యోతి, సబ్ జూనియర్ (35-37లో) కె.నందిని కాంస్య పతకాలు సాధించారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

సంస్కృతికి మకుటం.. సంబరాల పాఠం

● రెండో తరగతి తెలుగు వాచకంలో 'బతుకమ్మ' పాటలు

న్యూస్‌టుడే, కుంటాల : చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువును, సంస్కృతిని నేర్పించాలనే ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. ఈ మేరకు ప్రాథమిక తరగతుల్లోని తెలుగు పాఠ్యపుస్తకాల్లో ఒక్కో తరగతిలో ఒక్కొక్క సంస్కృతి, సంప్రదాయాలు, ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాటలు, పాఠ్యాంశాలు పొందుపరిచారు. 'జాబిలి-2' పేర రూపొందించిన రెండో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో 'బతుకమ్మ' సంబరాలను అయిదు పాఠ్యాంశాలుగా చేర్చారు. విద్యార్థులు పాటలను నేర్చుకోవడంతోపాటు బతుకమ్మ ప్రాముఖ్యం, సంస్కృతిని వంట పట్టించుకున్నారు. బతుకమ్మను పేర్చేందుకు పూలను కోసుకురావడం నుంచి మొదలుకొని బతుకమ్మను పేర్చడం, బతుకమ్మలెత్తుకొని ఊరి మధ్యలోకి తీసుకెళ్లి పెట్టడం, బతుకమ్మలాడటం, నిమజ్జనం చేసే వరకు వరుస క్రమంలో పాఠ్యాంశాలను పొందుపరిచారు.

✦ తెలుగు వాచకంలో మొదటి పాఠ్యాంశమైన 'రంగురంగుల పూలు'తో బతుకమ్మను పేర్చేందుకు ఉపయోగించే 22 రకాల పూల పేర్లు వచ్చేలా పాటను రూపొందించారు. బతుకమ్మ సంబరంలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా చిన్నారులు, మహిళల అలంకరణను 'ఓణీలు జడకుచ్చులు ఉయ్యాలో, ఒయ్యారమొలకంగ ఉయ్యాలో, బుట్టబొమ్మలోలే ఉయ్యాలో, బుజ్జిపాపలు కదలి ఉయ్యాలో, అద్దాల రవికలు ఉయ్యాలో, ముత్యాల చీరెలు ఉయ్యాలో, నడుముకూ వడ్డాణం ఉయ్యాలో, నాణ్యమైన నగలు ఉయ్యాలో, నిండైన గాజుల్ల ఉయ్యాలో, బతుకమ్మలెత్తిరి ఉయ్యాలో, నడిచేటి పాదాలు ఉయ్యాలో, నదులను బోలు ఉయ్యాలో.. అంటూ 'బతుకమ్మలెత్తుదాం'లో పేర్కొన్నారు.


✦ 'నిద్దుర పొమ్మంటు చందమామ, జోలపాటలు పాడి చందమామ, పోయిరా గౌరమ్మ చందమామ, మరలింరావే తల్లి చందమామ..' అంటూ సద్దుల బతుకమ్మ రోజున నిమజ్జనం గురించి 'పోయిరా గౌరమ్మ'లో పొందుపరిచారు. ఇలా.. తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపంగా నిలిచిన బతుకమ్మ పండుగపై సంపూర్ణ అవగాహనను పెంచుకున్న చిన్నారులు ప్రస్తుతం నిత్యం ఆయా బస్తీల్లోని చిన్నారులు బతుకమ్మలను పెట్టుకుని ఇవే పాటలను చదువుకుంటూ చిందులేసుకుంటూ సంబరంగా ఆడుకుంటున్నారు.



వానల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



రంగురంగుల పూల పాఠం



బతుకమ్మలెత్తుదాం